# మన బలగం

సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక

29-03-2025 శనివారం పేజీలు 4 www.manabalagam.com





## కేంద్ర వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన

### ముస్లింల ఆస్తులపై కేంద్ర హస్తక్షేపాన్ని వ్యతిరేకిస్తూ భారీ నిరసనలు

**న్యూఢల్లీ:** మైనారిటీ హక్కులను కాలరాస్తోందన్న ఆరోపణల మధ్య కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం సమాజం నేడు (శుక్రవారం) దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టింది. జుమా ప్రార్థనల అనంతరం ముస్లిం భక్తులు దేశంలోని అనేక నగరాల్లో రోడ్లపైకి వచ్చి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డుల స్వతంత్రతకు ముప్పు వాటిల్లేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న బిల్లును ముస్లిం సంఘాలు తీవ్రంగా వ్యతిరే కించాయి. ఈ బిల్లు వక్ఫ్ ఆస్తుల పరిపాలనను ప్రభుత్వాధీనంలోకి తీసుకురావడమే కాకుండా, ముస్లింల హక్కులను హరిస్తుందని ముస్లిం మత పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 3 లో




# అర్హులందరికీ కార్డులు, సన్నబియ్యం

### త్వరలోనే ఉప్ప, పప్పు, ఇతర సరుకులు కూడా..

- ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. త్వరలోనే పప్పు, ఉప్ప లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు.**

*నల్లగొండ, మార్చి 28 :* అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు, సన్నబియ్యం ఇస్తామన్న వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆ దిశగా అడుగులు వేశామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని అన్నారు. ఈ క్రమంలో ఉగాది రోజున పేదల జీవితాల్లో విప్లవాత్మక మార్పు రానుందని మంత్రి

మిగతా 2 లో



## కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

### అబద్ధాలతో పాలన సాగిస్తున్న రేవంత్ సర్కార్

### పెండిరగ్ ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే చెల్లించాలని : ఎమ్మెల్సీ కవిత

*హైదరాబాద్, మార్చి28 :* కాంగ్రెస్ పాలనలో ప్రజలు అశాంతిగా ఉన్నారని, ఈ పాలన ఎప్పుడు ఆగిపోతుందోనని ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. శాసనమండలిలో ఇవాళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్సీ

మిగతా 3 లో




## ఎన్నికల నిర్వహణకు సలహాలు అందించాలి

### రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

### లా & ఎన్ఫోర్స్ మెంట్ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఈఓ

..2 లో

## అర్హులందరికీ కార్డులు, సన్నబియ్యం

మొదటి పేజీ తరువాయి

ఉత్తమ్ అన్నారు. హుజూర్ నగర్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 85 శాతం జనాభాకు సన్నబియ్యం ఆందనుంది. రేషన్ బియ్యాన్ని చాలామంది ఉపయోగించుకోవడం లేదు. దొడ్డు బియ్యం తినకుండా కొందరు బ్లాక్ లో అమ్ముతున్నారు. అందుకే సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. బియ్యంతో పాటు త్వరలోనే పప్పు, ఉప్పు లాంటి ఇతర సరకులు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాటు చేశాం అన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎంతమందికి కావాలన్నా అర్హతను బట్టి ఇస్తున్నాం. కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో పేరు ఉంటే బియ్యం ఇస్తాం. రేషన్ బియ్యంపై కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏటా రూ.10,665 కోట్లు– ఖర్చు చేస్తున్నాయని ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే కార్డుకు అర్హుల జాబితా సిద్ధం అయ్యిందన్నారు. సిఎం రేవంత్ చేతుల మీదుగా పథకం ప్రారంభం అవుతుందని అన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డికి సన్మానం



ధర్మపురి మార్చి 28 మన బలగం : నంది మేడారం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది గడ్డం లింగారెడ్డి నూతనంగా గురువారం రోజున ఎన్నికై ధర్మపురి కోర్టు కి విచ్చేసిన సంధర్భంగా ధర్మపురి బార్ అసోసియేషన్ న్యాయవాదులు శ్రీ లక్ష్మి నరసింహా స్వామి చిత్ర పటం ప్రసాదం అందించి శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో రౌతు రాజేష్ , అలుక వినోద్ ,బందేల రమేష్, మామిడాల శ్రీకాంత్, గూడ జితేందర్ రెడ్డి , జాజాల రమేష్ , బత్తిని ఇంద్రకరణ్, కస్తూరి శరత్, సుంకె రాజు,కలమడుగు కీర్తి, పుల్లూరి సాయి శ్రీ రమ్య, ప్రవలిక అడ్వకేట్ క్లర్క్ రాజారపు నాగేందర్ పాల్గొన్నారు

## సెస్ ఆఫీస్ ముందు అడవిపదిర గ్రామస్తుల ధర్నా



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చ్ 28 మన బలగం : రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో అధిక భకాయిలు చెల్లించమని కరెంట్ కనెక్షన్ కట్ చేయడంతో సెస్ ఆఫీస్ ముందు నిరసన చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కుమార్, జాలపెల్లి మనోజ్ కుమార్ మాట్లాడుతూ అడవిపదిర గ్రామంలో అధిక భకాయిలు చెల్లించమని కరెంట్ కనెక్షన్ కట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు గతంలో ఒక సెస్ అధికారి నిర్లక్ష్యం వల్ల ఎక్కువ భాకాయిలు కురుకుపోయి భాదితులకు భారంగా మారింది దీనితో వేయిల రూపాయిలు భకాయిలు కట్టలేని పరిస్థితి లో ఉండడం తో అతన్ని సస్పెండ్ చేయడం జరిగిందని గతంలో ఈ సమస్యను పరిష్కారిస్తామని హామీని అధికారులు మరిచారని సమస్యను పరిష్కారంచకుండానే అధికారులు ఈరోజు కరెంట్ కనెక్షన్ కట్ చేయడంతో అడవిపదిర గ్రామస్తులు సెస్ ఆఫీస్ ముందు నిరసనకు దిగారని వారి సమస్యలతో పాటు మండలంలో పలు గ్రామాల్లో ఇదే సమస్య ఉందని దానిని పరిష్కారించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏ ఈ కి వినతిపత్రం అందజేచేశారు. ఏ ఈ స్పందించి కట్ చేసిన కరెంట్ కనెక్షన్ పెట్టాలని సంభందింత హేల్పర్ లకు ఆదేశించారు, సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో అడవిపదిర గ్రామస్థులు రాజవ్వ, పద్మ, దేవవ్వ, పూర్ణిమ, వనిత,ఎల్లవ్వ, పుష్ప, మంజుల, రాజవ్వ, రాజవ్వ, ప్రకాష్, క్రాంతి, జాషువా, కార్తిక్,మనోభిషేక్, విష్ణు రాభిన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సలహాలు అందించాలి




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిది మార్చి28 మన బలగం : పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సలహాలు, సూచనలు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఓటర్ జాబితా సవరణ పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు .సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో కంటే నిర్వహించిన ఎన్నికల కంటే మెరుగ్గా రాబోయే రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు, అన్ని వర్గాలకు చెందిన ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు వినూత్న కార్యక్రమాలు అమలుకు, పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలని ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మార్గదర్శకాల పట్ల ప్రతి ఒక్క సిబ్బంది అవగాహన కల్గి ఉండాలని, ప్రతి ఒక్కరికి తమ పాత్ర పట్ల , విధులు గురించి పూర్తిగా తెలిసి ఉండాలని అన్నారు. సజావుగా శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు చేపట్టాల్సిన చర్యల గురించి సలహాలు అందించాలని అన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారీ రాధాబాయి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భగవంతుడి ముందు అందరూ సమానమే

### ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ధర్మపురి మార్చి 28 మన బలగం : ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో సహకరించిన అన్నదాన దాతలు,పాత్రికేయ మిత్రులకు,మరియు వివిధ శాఖల అధికారులకు,ఆలయ అర్చకులకు,ఉద్యోగులకు ధర్మపురి పట్టణంలోని స్థానిక ఓల్డ్ టీటీడీ లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాలొన్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ చైర్మన్,కమిటీ సభ్యులు,ఆలయ ఈఓ తో కలిసి సన్మానించి జ్ఞాపికలను,స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు,బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి సేవను మోసిన బోయలకు 25 వేల రూపాయలను,దివిటీ మోసే నాయి బ్రాహ్మణులకు 5 వేల రూపాయలను వ్యక్తిగతంగా విప్ లక్ష్మణ్ కుమార్ అందజేసారు. అనంతరం విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులూ లేకుండా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నామని,ఈ సందర్భంగా వారికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని,బ్రహ్మోత్సవాల్లో అన్ని శాఖల అధికారులు ఎంతో సమన్వయంతో పనిచేయడం జరిగిందని,ఎక్కడ ఎటువంటి చిన్న ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరిగిందని,తాను అసెంబ్లీలో ఉన్నప్పటికీ ఎప్పటికప్పుడు ఆలయ అధికారులు,కమిటీ సభ్యులు,స్థానిక నాయకులతో మాట్లాడుతూ సమాచారం తీసుకోవడం జరిగిందని,ఆలయ అర్చకులు,అధికారుల సలహాల మేరకు ఎన్నడూ లేని విధంగా మొదటి సారిగా స్వామి వారి కళ్యాణాన్ని దేవాలయంలో కాకుండా బయట నిర్వహించడం జరిగిందనీ,దానికి భక్తులు,ప్రజల నుండి చాలా మంచి స్పందన రావడం జరిగిందని,స్వామి వారికి నిర్వహించే పూజాది కార్యక్రమాలు సమయానుకూలంగా జరగాలని,ఎవరికోసమో స్వామి వారి పూజాది కార్యక్రమాలు ఆలస్యం చేయరాదని,భగవంతుడి ముందు అందరూ సమానమే అని,తను అధికారంలో ఉన్నన్నీ రోజులు స్వామి వారికి సంబంధించి పూజాది కార్యక్రమాలు సమయానుకూలంగా జరిగిందే విధంగా చూడాలని ఆలయ ఈవో కి సూచిస్తున్నామని,నిన్న డిల్లీల్లో AICC ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ అధ్యక్షతన జరిగిన డిసిసి అధ్యక్షుల సమావేశంలో నాకు మాట్లాడే అవకాశం లభించడం చాలా ఆనందకరమైన విషయమని,అది లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సుల వల్లనే ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,అర్చకులు,కమిటీ సభ్యులు పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు

# టన్నెల్ లో మరో మృతదేహం గుర్తింపు

### రెండు బాడీలు తీసేందుకు రెస్క్యూ బందాలు బురద, సున్నం మట్టితో ఇబ్బందులు



నాగర్ కర్నూల్, మార్చి 28 : ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు టన్నెల్ బోరింగ్ మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు సొరంగంలో కూలిన మట్టిలో చిక్కుకుపోయి నేటికీ ఐదు వారాలు గడిచిపోయింది. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి, ఆర్మీ, కేరళ పోలీస్, క్యాడవార్ డాగ్స్ వంటి రెస్క్యూ టీంలు దాదాపు 600 మంది.. మూడు స్విఫ్ట్‌ల్లో నిరంతరాయంగా సహాయక చర్యలు చేపడుతున్నా ఫలితం లేకుండా పోతుంది. సొరంగంలో కార్మికులపై కూలిన మట్టిని తొలగించేందుకు రెస్క్యూ టీంలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉబికి వస్తున్న ఊట నీటితో సొరంగమంతా బురదమయంగా మారడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. కార్మికుల మృతదేహాలను గుర్తించేందుకు అడ్డుగా ఉన్న బోరింగ్ మిషన్‌ను కటింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు లోకో ట్రైన్ ద్వారా శకలాలను బయటకు పంపిస్తున్నారు. ఇటీవల లభ్యమైన మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో మరో డెడ్ బాడీ ఉన్నట్లు గుర్తించిన రెస్క్యూ బృందాలు బయటకు తీసేందుకు శ్రమిస్తున్నాయి. కార్మికులకుపై పడిన బురద మట్టి, సున్నం మట్టి బిగుసుకుపోవడంతో మట్టిని తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కేడవార్ డాగ్స్‌ను తెప్పించి మరోసారి సొరంగంలో పరిశీలించినా దుర్వాసన వల్ల మృతదేహాలను గుర్తించకపోయినట్టు తెలుస్తుంది. శుక్రవారం ఏడున్నర గంటల ప్రాంతంలో రెస్క్యూ బృందాలు మరోమారు టన్నెల్లోకి సహాయక చర్యలు చేపట్టేందుకు బయలుదేరాయి. రెస్క్యూ బృందాలు మధ్యాహ్నం తర్వాత బయటకు వచ్చే అవకాశం ఉండడంతో మనోజ్ కుమార్ మృతదేహానికి సమీపంలో ఉన్న మరో వ్యక్తి డెడ్ బాడీ వివరాలు తెలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక చర్యల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం శివశంకర్ అనే ఓ ప్రత్యేక అధికారిని నియమించింది. గత మూడు రోజులుగా ఆయన సమక్షంలోనే రెస్క్యూ బృందాలు సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి.

MANA BALAGAM

మన బలగం
సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక

# కేంద్ర వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన

**మొదటి పేజీ తరువాయి**

బిల్లుతో ముస్లిం ఆస్తులపై కేంద్ర ఆధిపత్యం కేంద్రం ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు బిల్లులో వక్ఫ్ భూములు, ఆస్తుల నిర్వహణపై పూర్తి నియంత్రణను ప్రభుత్వానికి అప్పగించేందుకు మార్గం సుగమం చేస్తోంది. ఇది వక్ఫ్ బోర్డుల స్వతంత్రతను దెబ్బతీస్తుందని ముస్లిం మత పెద్దలు, న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వక్ఫ్ ఆస్తులు ఎప్పటి నుంచో ముస్లిం సమాజానికి సేవలందించే దేవాదాయ ఆస్తుల వంటివి. వీటి నిర్వహణను ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావడం ముస్లిం హక్కులపై కవాతం వేసినట్టే అని వారు అభిప్రాయపడుతున్నారు.




### దేశవ్యాప్తంగా నిరసన జ్వాలలు

దేశ రాజధాని ఢిల్లీ నుంచి హైదరాబాద్ వరకు, లక్నో నుంచి కోల్‌కతా వరకు దేశ వ్యాప్తంగా అనేక నగరాల్లో ముస్లింల నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. 'వక్ఫ్ ఆస్తులపై హక్కు మాకు, కేంద్రానికి కాదు', 'ముస్లిం ఆస్తులను హరిస్తే ఊరుకోం' అంటూ నినాదాలతో ముస్లిం సమాజం వీధుల్లో గళమెత్తింది. ముస్లిం మతపెద్దలు, సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వం తక్షణం బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లిం మత నాయకుల ఆధ్వర్యంలో పలు నగరాల్లో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించగా, ముస్లింల ఆదరణ భారీగా కనిపించింది.

### ఆస్తుల స్వతంత్రత కోల్పోతే మైనారిటీలకు ముప్పు

ముస్లిం మత పెద్దలు, న్యాయ నిపుణులు స్పష్టంగా హెచ్చరిస్తూ, వక్ఫ్ బోర్డులపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ తెచ్చే ప్రయత్నం మైనారిటీ హక్కులకు పునాది దెబ్బతీసే ప్రయత్నమే అని తెలిపారు. వక్ఫ్ బోర్డుల స్వతంత్రతకు ముప్పు వాటిల్లితే ముస్లింల సమాజ సేవా కార్యక్రమాలు నిలిచిపోతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

### కేంద్రం వెనక్కి తగ్గకుంటే తీవ్ర పరిణామాలు

నిరసనకారులు 'బిల్లు వెనక్కి తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు జరుగుతాయి' అని హెచ్చరిస్తున్నారు. ముస్లింల హక్కులను కాలరాస్తే అది దేశంలో మత సామరస్యానికి గండిపడుతుందని ముస్లిం మత పెద్దలు స్పష్టం చేశారు. 'వక్ఫ్ ఆస్తులపై ముస్లింలకే హక్కు... ప్రభుత్వానికి కాదు' అని వారు గళమెత్తారు.

### స్పందించకపోతే నిరసనలు ఉధృతం

ప్రస్తుతం కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో ముస్లిం సంఘాలు నిరసనలను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించాయి. ముస్లిం సమాజాన్ని అవమానించే ఏ చర్యనైనా ఉపేక్షించబోమని ముస్లిం నేతలు హెచ్చరిస్తున్నారు. బిల్లు వెనక్కి తీసుకునే వరకూ ముస్లింల ఆందోళనలు ఆగవు అని స్పష్టం చేశారు. కేంద్రం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతంగా మారి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ముస్లిం మత పెద్దలు హెచ్చరించారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్



మల్యాల మార్చి 28 (మన బలగం) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వాటికి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్ అన్నారు. మండల పరిధిలోని ముత్యంపేట గ్రామంలో పరిధిలోని ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ జన సురక్షా భీమా పథకాలైన "ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన", "ప్రధాన మంత్రి సురక్షా భీమా యోజన ", "సుకన్య సమృద్ధి యోజన", "అటల్ పెన్షన్ యోజన" పథకాల గురించి వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని సూచించారు. ఏదైనా బ్యాంక్ లో లేదా పోస్టాఫీసు లో ఖాతా కలిగి ఉండి 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వయస్సు మధ్య కలిగిన వారందరూ ఈ పథకాలకు అర్హులని చెప్పారు. సహజ మరణం మరియు ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే ఆ కుటుంబ సభ్యులైన నామినీ కి కేంద్ర ప్రభుత్వం నమోదు చేయించుకోబడిన బ్యాంక్ ఖాతాలో రెండు లక్షల రూపాయలు జమ చేయడం జరుగుతుందని, అవయవం కోల్పోయిన సందర్భం ఉన్నట్లయితే ఒక లక్ష రూపాయలు ఆ కుటుంబానికి చెందిన నామినీకి అందజేయడం జరుగుతుందని తెలిపారు. రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజులకు ఎవరూ స్పందించవద్దని, ఎటువంటి లింకులు ఓపెన్ చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్ మల్లేశం, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి

## వ్యవసాయ శాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల ప్రతినిధి, మార్చి 28( మన బలగం) : జగిత్యాల నియోజకవర్గంలో ఈ ఏటా అరు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు పండించారని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ను జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కోరారు. శుక్రవారం మంత్రి కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మొక్క జొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటును కోరారు. ఈ సారి జగిత్యాల నియోజకవర్గం లో అత్యధికముగా 6 వేల ఎకరాల్లో మొక్క జొన్న ను పండించారని కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తన విన్నపానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చ్ 28 (మన బలగం) : రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం భావు సింగ్ నాయక్ తండా గ్రామ శాఖ అధ్యక్షులు భూక్యా లింగం నాయక్ లతో కలిసి లబ్దిదారులైన బానోత్ భవాని- మదన్ లకు 22500 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఏఎంసీ డైరెక్టర్ చంద్రమౌళి లతో కలసి కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్ లు అందించారు.

# కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల్లో అశాంతి

**మొదటి పేజీ తరువాయి**

కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దుష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్దాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్ పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. 'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు. సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామని, అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని కవిత చెప్పారు. ఈ మండలి సమావేశాలు రాష్ట చరిత్రలో నిలిచిపోతాయని, ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని తెలిపారు. ఆ బిల్లుల ఆమోదానికి బీఆర్ ఎస్ పార్టీ కృషి ఫలితం ఎంతో ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుష పదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలు ఆయన చరిత్రలో మరకగా ఉండిపోతాయని అన్నారు.

# గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్లో చేర్చేందుకు తీర్మానం చేయడం హర్షం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలాభిషేకం

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మార్చి 28 మన బలగం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోర్ బోలి భాషను అధికార భాషగా గుర్తించి భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్లో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడం పట్ల వీర్నపల్లి మండల గోర్ బోలి గిరిజ నలు హర్షం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ధన్యవాదాలు తెలియజే స్తూ.. పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన 15 కోట్ల బంజారాలు మాట్లాడి భాషా గోర్ బోలి భాషను అధికార భాషగా గుర్తించి భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్లో చేర్చాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆమోదించడానికి.. 15 కోట్ల బంజారా సమాజం పక్షాన.. వీర్నపల్లి మండల గిరిజనుల పక్షాన తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి, మంత్రి జూపల్లి , కృష్ణారావు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , మంత్రి పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లకు ప్రత్యేక ధన్యవాదాలు. ఈ కార్యక్రమంలో వీర్నపల్లి మండల గోర్ బోలి గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

